# పునరుత్థానం

ముఖాన్ని బలంగా రుద్దుకున్నాడు పార్వతీశం. టీవీలో ఏదో సీరియల్. భార్య గట్టిగా నవ్వుతోంది. పిల్లలు ఆమెతో శృతి కలిపేరు.

తను నవ్వడు, తనకు నవ్వురాదు తనలో మెదిలే భావాలు ఇవీ అని తెలిస్తే భార్య నవ్వలేదేమో... ఆలోచనల్లో పడ్డాడు పార్వతీశం.

చర్చిలో గంటలు మోగుతున్నాయి. ఒకటి... రెండు... మూడు... మరి లెక్క పెట్టలేకపోయాడు. ఎవరో చనిపోయారు... ఆ గంటల శబ్దంలో మళ్ళీ బాధ మొదలయ్యింది పార్వతీశానికి.

తన ఈ సమస్యకు మూలం ఎక్కడ? బాల్యంలోకి జారుకున్నాడు.

వెలిసిపోయిన ఫాంటు, అతుకువేసిన చొక్కా, చేతిలో గుడ్డ సంచి.

ఆ ఆఫీసు చూసే సరికి భయం. ఆ కార్యాలయం రాతిగోడలు, దాని సిబ్బంది హృదయంలా కరకుగా ముందున్న చెట్టు మీది పక్షులు వికృతంగా అరుస్తూ... మెట్లు దాటేడు. వరండా అక్కడ కూర్చున్న వ్యక్తి మునసబుగారు. ప్రశ్నార్థకంగా చూసి "దేనికొచ్చావ్" అనడిగాడు.

"సర్టిఫికెట్..." అంటూ తను తలొంచుకున్నాడు.

"అదే ఏం సర్టిఫికెట్?"

"కేస్ట్ సర్టిఫికెట్...!"

"అది చెప్పడానికి నామోషీ ఎందుకు?"

నామోషీ కాదు భయం. మునసబును చూడగానే భయం వేస్తుంది. బాగా ఉబ్బిన పొట్ట... గారపట్టిన పళ్ళు... చెవుల మీద వెంట్రుకలు... గుబురుగా పెరిగిన గడ్డం.... "ఏదీ నీ రికార్డు ఇలాతే..." మునసబు అడగ్గానే కాగితాలు అందించాడు.

కాగితాలు చూసి అనుమానంగా ముఖం వైపు దృష్టి సారించేడు.

"మీ నాన్న పేరు అబ్రహామ్... నీ పేరు పీటర్, మీరు హిందూ ఆది ఆంధ్రా... అంటే షెడ్యూల్డ్ కేస్ట్... నేను నమ్మాలి...."

మునసబు ముఖం మరింత క్రూరంగా మారింది. "మోసం... మీరు క్రిష్టియన్లు, పై నుంచి వచ్చే డబ్బు కోసం మతం పుచ్చుకున్నారు, మళ్ళీ రిజర్వేషను కావాలా?! ఇవ్వను ఫో...." కాగితాలు విసిరికొట్టాడు.

పీటర్ క్రిందపడిన కాగితాలు ఏరుకొని "నాకు ఇంటర్‌లో ఎనభై ఐదు శాతం మార్కులొచ్చాయి. బీయస్సీ ఏజీలో సీటొచ్చింది, రెండు రోజుల్లో జాయిన్ కావాలి..."

"అయితే...." మునసబు అరిచాడు.

సంచీ భుజాన తగిలించుకున్నాడు, కళ్ళల్లో నీళ్ళు తుడుచుకున్నాడు, "సార్ నా టీసీ చూడండి, దాంట్లో అలాగే రాసుంది."

"రాయించుకొస్తారోయ్... రాయించుకొస్తారు..." మునసబు కోపంగా అనడంతో పీటర్ గబగబా వెనక్కి తిరిగాడు కాళ్ళకు చెప్పులు లేవు... ఎండ పొడుస్తోంది. పరిగెత్తుకుంటూ ఇంటికొచ్చాడు.

గుడిసె ముందు తండ్రి అబ్రహాం చుట్ట కాల్చుకుంటూ! కోపం వచ్చేసింది పీటర్‌కి

"నా కెందుకీ పేరు పెట్టావ్? మీ నాన్న నీకా పేరెందుకు పెట్టేడు?"

"ఏమో.... నాకు తెల్దురా..." అన్నాడా వెర్రిబాగుల తండ్రి చదువు కోలేదుగా.

జరిగిపోయింది, తప్పు జరిగిపోయింది. అది తన భవిష్యత్తును కాల్చేయబోయింది అయితే తమ గూడెంలో దాసుగారు చదువు కొన్నాయన. కలెక్టరుగారితో మాట్లాడేడు, ఆయన ఎమ్మార్వోని ఎంక్వయరీ వెయ్యమన్నాడు. ఊళ్ళో పంచాయితీ పెట్టేరు.

"నక్క అబ్రహామ్ మతం పుచ్చుకోలేదు, అతడు హిందువు, హరిజనుడు..." అని ఊళ్ళో పెద్దలు చెప్పేరు. చర్చిలో ఫాదరు తన పుస్తకం తిరగేసి తాము మతం పుచ్చుకోలేదని తేల్చేరు.

అలా ఎన్నో కష్టాలతో తనకు కులధృవీకరణ పత్రం, ఆ తర్వాత అగ్రికల్చరల్ బీయస్సీలో సీటు.. అప్పట్నించీ భయం... అంతర్గతంగా ఆ భయం దినదిన ప్రవర్ధమాన మవుతూ వచ్చింది..

చదువుయింతర్వాత మళ్ళీ ఉద్యోగాల వేటలో ఆ సర్టిఫికేట్ అవసరం వచ్చింది. మళ్ళీ కథ మామూలే... పింఛనుదారులు నెల నెలా బతికున్నట్టు సర్టిఫికెట్టు తెచ్చుకోవాలి. అలాగే తనూ, తన కులం ఇదీ... అనే ధృవపత్రం... దాని కోసం యాతన... మునసబుచుట్టూ, రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ.... అలా ఉద్యోగం వచ్చేవరకూ దానికి ఫుల్‌స్టాప్ లేదు.

ఉద్యోగాల అన్వేషణలో చివరికి బేంక్‌లో ఉద్యోగం వచ్చింది, తెలంగాణాలో ఒక మారుమూల బ్రాంచిలో ఫీల్డ్ ఆఫీసరగా, ఆ బ్రాంచి మేనేజరుది తన కులమే. ఒక రోజు ఆయనింటికి వెళ్ళేడు.

"పూజగదిలో వున్నారు కూర్చోండి." అన్నారు ఇంట్లోవాళ్ళు తనకు అనుమానం వేసింది. ఆయన ఒక అరగంట తర్వాత వచ్చేడు. ముఖం మీద బొట్టు... తనకు ప్రసాదం పెట్టేడు.

"మీరు హిందువులా..." తను అడిగేడు ఆయన నవ్వి, చెప్పడం ప్రారంభించాడు.

"నేను దళితుడుగా పుట్టేను.. నా తండ్రి దళితుడు.. అతడి తండ్రీ దళితుడే మన దళితుల్ని ఈ గడ్డ మీద హిందూ ఆది ఆంధ్రగా వర్గీకరించేరు. అదే తమిళనాడులో ఆది ద్రావిడ కర్ణాటకలో ఆది కర్ణాటక.. మనలో కొంతమంది మాల... మరికొంత మంది మాదిగ.. కొంతమంది రెల్లి.. ఇలా ఎన్నెన్నో.... ఏ కులమైనా అందరూ దళితులే... మనల్ని గుళ్ళోకి రానిచ్చేవారు కాదు. బళ్ళోకి రానిచ్చేవారు కాదు. అప్పుడు ఫాదరీలు వచ్చారు అమెరికా నించి. స్కూళ్ళు పెట్టేరు. చర్చిలు పెట్టేరు.. సామాజిక అణచివేతకు గురైన మనల్ని క్రైస్తవ మిషనరీలు ఆదరించాయి. సామాజిక పరివర్తన కోసం సంఘంలో స్థానం కోసం మనం వారిని ఆశ్రయించాము. అయినా నాలాంటి చాలామంది వంశానుగత సాంప్రదాయాల్ని వదిలిపెట్టలేదు."

అలా ఆ రోజు ఆయన మాటలు తనలో బలంగా నాటుకున్నాయి. అంతే! తనుపేరు మార్చుకున్నాడు. హిందువుగా బతుకుతున్న ఆయన కూతుర్ని పెళ్ళి చేసుకున్నాడు.

అయినా తనలో ఏదో తెలీని గిల్టీ... తనకు స్వేచ్ఛలేదు... ఎవరైనా ఏ మతమైనా పుచ్చుకోవచ్చు... కానీ తనలాంటి వారికి ఆ అవకాశం వుందా...

"పీటర్‌గారూ!..." బైటనించి కేక.

ఆలోచనల్లోంచి బైటికొచ్చాడు.

"ఏమండి. ఎవరో పిలుస్తున్నారు, వెళ్ళి తలుపు తియ్యండి" భార్య టీవీలోంచి తలెత్తకుండానే అంది.

మౌనంగా కూర్చుండిపోయాడు. మళ్ళీ "పీటర్‌గారూ..." అనే కేక.

"లేదు... పీటర్ చచ్చిపోయాడు. తనే పీటర్ శవానికి నిప్పంటించి పార్వతీశంగా ఉద్భవించేడు. ఫీనిక్స్... ఎందుకు? మనుగడ.. స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్సీ..."

బైట నించి పిలిచిన వ్యక్తి లోపలికొచ్చాడు. ఆయన లాజరస్, తమ ఊరివాడే.. యూనివర్శిటీలో రీడర్.

పార్వతీశం లాజరస్‌కు నమస్కారం పెట్టి కుర్చీలో కూర్చోమన్నాడు. అతని ముఖం ఎందుకో దిగాలుగా కనిపించింది. తన ముఖంలా పార్వతీశంకు.

"చూసారా పేపర్లో వార్త..." అన్నాడు లాజరస్. పార్వతీశం ప్రశ్నార్థకంగా ముఖం పెట్టేడు.

"అదే దక్షిణ గుజరాత్‌లో దాడుల గురించి!"

"ఏం దాడులు?!" ఎదురు ప్రశ్న వేసాడు పార్వతీశం.

"మీలాంటి వాళ్ళుండబట్టే మన మీద దాడులు జరుగుతున్నాయి, ప్రతిఘటించే వాళ్ళు లేక..."

"మీరు చెప్పేది నాకు ఒక్క ముక్క కూడా అర్థం కావడం లేదు!" అన్నాడు పార్వతీశం, లాజరస్ మాటలు పూర్తికాకుండానే.

"సరే చెబుతాను వినండి, దక్షిణ గుజరాత్‌లో క్రైస్తవుల పై దాడులు జరిగాయి. చర్చిలు కాల్చేసారు. ఇదంతా ఒక పద్ధతి ప్రకారం జరిగింది. దీన్ని వ్యతిరేకిస్తున్నాం... నగరంలో అందరం రాలీ జరుపుదామనుకుంటున్నాం." అతను చెప్పడం ఆపి పార్వతీశం వంక చూసాడు.

పార్వతీశం వెంటనే అన్నాడు... "నేను క్రిష్టియన్‌ని కాను."

లాజరస్ పార్వతీశం వంక సూటిగా చూసాడు. ఆ చూపులు వేడికి తట్టుకోలేక

పార్వతీశం తలొంచుకున్నాడు.

"మీరెందుకలా ఆత్మవంచన చేసుకుంటారు. క్రిస్టియన్ కాదు, దళితులు, పోనీ వారి మీద జరుగుతున్న దాడుల గురించి ఆలోచిస్తున్నారా?!" అలా అని చెప్పి లాజరస్ విసురుగా లేచి నించున్నాడు. "అన్నయ్యగారూ కాఫీ తాగి వెళుదురు గాని" పార్వతీశం భార్య చెపుతున్న మాటలకు, "ఫరవాలేదమ్మా!" అంటూ బయటకు నడిచాడు లాజరస్.

* * * * *

ఉదయం పదయింది. ఆ రోజు ఆలస్యంగా లేచేడు, ఆదివారం కాబట్టి. అప్పటికే పిల్లలు టిఫిన్లు ముగించి ఆటల్లో పడ్డారు. కాఫీ, టిఫిను అయిందనిపించి ఇంట్లోంచి బయటపడ్డాడు. లాజరస్ ఇంటి వైపుగా నడవడం ప్రారంభించాడు.

నగరం నిశ్శబ్దంగా ఉంది. 'ఈ నిశ్శబ్దాన్ని భరించలేను' అనుకుంటూ ఆలోచిస్తూ నడుస్తున్నాడు పార్వతీశం.

'తను లాజరస్‌కు ముఖం ఎలా చూపించాలి? పిరికివాడు, పలాయనవాది, అవకాశవాది, ఏం పేరు పెట్టాలి తనకి?' అలా అనుకుంటూ ముందుకు నడుస్తున్నాడు.

ఇంతలో "పార్వతీశం ఉరఫ్ పీటర్" అని పిలుపు ఆ పిలుపుకు తలెత్తి చూసాడు. ఎదురుగా తను కలవాలనుకుంటున్న లాజరస్.

లాజరస్ పార్వతీశం వైపు దృష్టి సారించాడు. లోతుకు పోయిన కళ్ళు, నిద్రలేమితో అలసటగా వున్న ముఖంలో దిగులు మేఘాలు.

"ఎందుకయ్యా, హఠాత్తుగా ఇలా తయారయ్యావ్" అన్నాడు లాజరస్, అతడిని మరింత పరీక్షగా చూస్తూ...

ఆ మాటలకే సమాధానం చెప్పకుండా తలొంచుకున్నాడు పార్వతీశం.

"ఏమిటి, నీలో నీవు కుమిలిపోతే ఎలా? నాకు చెప్పు, సాధ్యమైతే సమస్యను పరిష్కరిద్దాం." అన్నాడు లాజరస్.

ఆ మాటలకు రెండు చేతులతో ముఖం కప్పుకుంటూ... "నన్ను కాలుస్తారా? పూడుస్తారా? చనిపోయింతర్వాత? దహనమా, ఖననమా ఇదే సందేహం... దాంతో తెలీని బాధ గుండెల్ని పిండేస్తోంది. శరీరాన్ని కుదిపేస్తోంది... క్షణం నిలవనీయడం లేదు.... అనుక్షణం అంతర్మధనం..." అన్నాడు పార్వతీశం.

ఊహించని పార్వతీశం సమాధానానికి లాజర్ ఉలిక్కిపడి, "నీకెందుకీ అనవసరపు ఆందోళన... నిండా నలభయ్యేళ్ళు లేని నీకెందుకీ శ్మశాన వైరాగ్యం...?" అన్నాడు

ఆ మాటలకు సమాధానం చెప్పకుండా మౌనంగా నడుస్తున్నాడు పార్వతీశం.

ఇద్దరూ రెండడుగులు వేసే సరికి ఒక వ్యక్తి ఎదురుపడి, "నమస్కారం పార్వతీశం గారూ! ఈ మధ్య శలవులో వున్నట్టున్నారు.." అన్నాడు.

"ఔనండీ... మా మావయ్య చనిపోయాడు. మా ఊరెళ్ళి ఈ మధ్యే వచ్చాను" అన్నాడు పార్వతీశం.

ఆ వ్యక్తి వెళ్ళిన వెంటనే లాజరస్ అడిగాడు. "నీకు మావయ్యలా, ఎప్పుడూ చెప్పలేదే, నువ్ ఊరెళ్ళినట్టు తెలుసుగానీ... అందుకోసం అని తెలిదు. అయినా నీకు స్వంత మావయ్యలు... అదే మీ అమ్మకు అన్నయ్యలు, తమ్ముళ్ళు ఎవరూ లేరు కదా? అన్నాడు లాజరస్.

"ఉండేవాడు?" పార్వతీశం క్లుప్తంగా చెప్పాడు. లాజరస్ అతడి మాటలకు ఆశ్చర్యపడుతూ "ఎలా చనిపోయాడు?" అడిగాడు.

పార్వతీశం చెప్పడం ప్రారంభించాడు. "మా అమ్మకు ఒక తమ్ముడున్నాడు, అయితే చిన్నతనంలోనే ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు, అందుకే ఆయన్ని మేం పూర్తిగా

మరిచిపోయాము. తిరిగి వస్తాడనుకోలేదు" అన్నాడు.

"ఇన్నేళ్ళకి తిరిగొచ్చాడా?" అన్నాడు లాజరస్ ఆశ్చర్యంలోంచి బైటకు రాకుండానే.

"ఔను" ఆధ్యాత్మిక చింతనతో దేశం నలుమూలలా తిరిగి సాధువులా జీవితం గడిపి యాభయ్యేళ్ళ వయసులో అక్కను చూద్దామని వచ్చాడు మా అమ్మకున్న ఒకే ఒక్క తమ్ముడు. తెల్లటి గడ్డం, మీసాలు, నుదుటున విభూతి రేఖలు, మెడలో రుద్రాక్షలు, వంటికి కాషాయ వస్త్రాలు, మా అమ్మ చర్చికి వెళుతుంది. మా మావయ్య ఇక్కడి కొచ్చి తనకు తెలిసిన పురాణ ప్రవచనాలు. బోధించడం ప్రారంభించాడు. ఆ వీధిలో అందరూ క్రైస్తవులే! మా అమ్మ మీది గౌరవం కొద్దీ అతడిని భరించారు. కొంతమంది ముఖం మీదే విమర్శించారు. కారణం వారితో వాదోపవాదాలుచేసేవాడు."

చెప్పడం ఆపి ఊపిరి పీల్చుకున్నాడు పార్వతీశం.

"అయితే మీ అమ్మ స్పందన ఎలా వుంది?"

లాజరస్ ప్రశ్నకు క్షణం సేపు ఆలోచనలో పడి మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

"చాలా సంవత్సరాల తర్వాత వచ్చిన తమ్ముణ్ణి చూసుకుని ఆనందపడింది. అతడి మతాన్నీ జీవన విధానాన్నీ ఓపికగా భరించింది. ఇంట్లోనే తన పూజా కార్యక్రమాలు జరుపుకునేవాడు... ఊళ్ళోని సాధు జనాలను పోగుచేసి చర్చలు జరిపేవాడు... ఇలా వారం రోజులు గడిచాయి... ఒక రోజు ఏం జరిగిందంటే?

"ఏం జరిగింది? ఆ తమ్ముణ్ణి తన్ని తగలేసిందా మీ తల్లి" అన్నాడు ఆతృతగా లాజరస్.

"లేదు, తనని తగలేస్తారో, పూడుస్తారో అంటూ ఆయనే పోయాడు పైకి. రాత్రికి రాత్రే నిద్దట్లో..."

"అయ్యో, ఏమయిందపుడు?..." లాజరస్ బాధగా అన్నాడు.

"తమ్ముడి అంతిమయాత్ర తన చేతుల మీదుగా జరుపుదామని మా అమ్మ పెట్టె తయారుచేయించింది. చర్చిలో పాస్టరుగారికి తెలియజేసింది... అయితే ఆ వీధిలో మిగతా వారు ఒప్పుకోలేదు, అతడు మతం పుచ్చుకోలేదు, అతడిని మన సమాధుల దొడ్డిలో సమాధి చేయడానికి వీల్లేదంటూ గొడవ పెట్టారు..."

"అలాగా... ఇది ఆలోచించవలసిన విషయం..." అన్నాడు లాజరస్ బాధగా.

"ఆఖరికి సంఘ పెద్దలంతా తీర్మానించారు... అతడు హిందువులా బ్రతికాడు, ఆ సంప్రదాయం ప్రకారం దహనం చెయ్యండి అన్నారు. అంతే, ఖననం కోసం ఏర్పాట్లు చేసాం గానీ చివరకు మావయ్యను దహనం చెయ్యవలసి వచ్చింది. అదీ నా చేతులు మీదుగా. అదిగో అప్పట్నించీ..."

పార్వతీశం చెప్పడం ఆపి లాజరస్ వంక చూసాడు... అతడికి ఏం సమాధానం చెప్పాలో తెలీక మౌనంగా నడుస్తున్నాడు లాజరస్. అంతలో చర్చిలో గంటలు వినిపించాయి. పార్వతీశంకు లాజరస్ ఎక్కడికి వెళుతున్నాడో అర్థమయింది. అతనితో పాటు వెళ్ళాలని లేదు. అయినా అన్యమనస్కంగా అతణ్ణి అనుసరించాడు.

చర్చిలో ప్రవేశించేసరికి ఆ నిశ్శబ్ద వాతావరణం ఉక్కిరిబిక్కిరి చేసినట్టయింది పార్వతీశానికి.

తెల్లటి అంగీలో పావురంలా ఫాదర్. ప్రసంగం అప్పటికే మొదలయింది.

జీససని పట్టి అప్పగించే చారిత్రక సంఘటనను ఫాదర్ వివరిస్తున్నారు.

"పీటర్ మూడుసార్లు బొంకేడు. జీసస్ ఆ విషయం ముందే ఊహించారు." ఫాదర్ చెపుతున్న ఆ మాటలకు పార్వతీశం ఉలిక్కిపడ్డాడు. తానెన్ని సార్లు బొంకేడు? పార్వతీశానికి అసహనంగా వుంది. చర్చిలోని వారినందరినీ ఒక్కసారి గమనించేడు. వారిలో ఆనందం, ఏదో ఉద్వేగం... వాళ్ళూ తన లాంటి వారే అయినా వారికి లేని అంతర్మథనం తనొక్కడికే ఎందుకు?

ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాడు పార్వతీశం. ఎదురుగా కర్రల మీద పడుకోబెట్టారు. మంత్రాలు చదివి తన దేహానికి స్నానం చేయించారు. తనను పడుకోబెట్టిన దిక్కు మార్చారు. చుట్టూ ప్రదక్షిణ చేసిన కొడుకు నిప్పుల కుండతో ముందుకు నడుస్తున్నాడు. శ్మశాన వాటికలో తనను కట్టెల మీదుంచుతున్నారు. మూడు సార్లు చుట్టూ తిరిగిన కొడుకు నీటికుండ బద్దలు చేసాడు. చితికి నిప్పంటించాడు.. కట్టెలు అంటుకున్నాయి. వెనక్కి చూడ కుండా వచ్చేస్తాడు కొడుకు తను కాలి తెల్లని బూడిదయ్యాడు ఆ తర్వాత?!!

పార్వతీశం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి అనుకోకుండా మనసులో ప్రత్యక్షమైన ఆ దృశ్యంతో మనసులో భయం నీడలు. చర్చిలో అందరూ లేచి నించున్నారు. ఇక వుండలేక గబగబా బైటకు నడిచాడు పార్వతీశం.

* * * * *

తరువాత రోజు ఆఫీసులో లెడ్జరులో తలదూర్చిన పార్వతీశానికి మేనేజర్ నించి పిలుపు.. "లక్షల్లో తేడా. ఏమిటిసార్? ఎప్పుడూ రాలేదు. మిస్ కాలిక్యులేషన్ ఆఫీసర్లం జాగ్రత్తగా వుండాలి, పోనీ లెండీ ఆడిటర్ల దృష్టిలో పడకముందే పట్టుకున్నాం."

బ్రాంచి మేనేజర్‌కి కోపం వచ్చినప్పుడల్లా 'సార్' అని సంబోధిస్తాడు, అయినా తను పనిలో ఎప్పుడూ వేలెత్తి చూపించుకోలేదు. తన మనసు పనిచెయ్యనివ్వడం లేదు. తనకో రెండు రోజుల శలవు కావాలని మేనేజర్‌గారికి చెప్పి ఇంటికి బయలుదేరాడు పార్వతీశం.

దారిలో సిటీక్లబ్ దగ్గర ఏదో బేనర్ కనిపించింది. ఆ క్లబ్‌లో పార్వతీశానికి సభ్యత్వం ఉంది. స్కూటర్ ఆపి భేనర్ వైపు దృష్టి సారించాడు.

"మానసిక ప్రశాంతత కోసం ధ్యానం చెయ్యండి. మీ అంతరంగిక రుగ్మతల్ని దూరం చెయ్యడానికి యోగాభ్యాసం దారిచూపుతుంది."

ఆ బేనర్ మీద అక్షరాలు చదివి గబగబా లోపలికి ప్రవేశించాడు. ఆ గదిలో అందరూ పద్మాసనంలో కూర్చున్నారు. వారి కెదురుగా తెల్లటి గెడ్డం, మీసాలతో ఒకాయన ప్రశాంతంగా కూర్చుని కనిపించాడు. ఆయనకు నమస్కారం చేసి, “ఈ యోగా తరగతిలో పాల్గొందామని వచ్చాను.” అన్నాడు.

ఆయన మందహాసం చేస్తూ “మీ పేరు....?” అనడిగాడు.

పీటర్ అనబోయి “పార్వతీశం”అన్నాడు తడబడుతూ...

“పార్వతీశం అంటే?” ఆయన ప్రశ్నించాడు.

“నేనే”.... అన్నాడు.

“నేనే అంటే?”

“పార్వతీశం” ఆయన ప్రశ్నకు సమాధానంగా చెప్పాడు పార్వతీశం.

“నేను... పార్వతీశం వేరు వేరా?...” ఆయన తిరిగి ప్రశ్నించాడు.

“నేనే పార్వతీశం.. పార్వతీశమే నేను...” అన్నాడు ఆలోచించి.

“అయితే ఈ తలకాయ ఎవరిది?” అన్నాడాయన పార్వతీశం తల నిమురుతూ.

“నాదే...” అనేసాడు పార్వతీశం

“అంటే తలకాయ నువ్వు కాదన్న మాట...?”

ఆయన లాజిక్ అర్థం కాలేదు పార్వతీశానికి.

పార్వతీశం బట్టల మీద చెయ్యి వేసి, ఇవి ఎవరివి? అన్నాడాయన.

“నావే!?” అన్నాడు పార్వతీశం నవ్వుకుంటూ.

“మీ బట్టలను తీసివేసి హేంగర్‌కి తగిలించినట్టు తలకాయను మీ నుంచి

వేరు చేసి దాచుకోవచ్చు? అంతేకదా.

పార్వతీశం తెల్లమోహం వేసాడు.

ఆయన నవ్వుతూ చెప్పాడు

"తలకాయ, కాళ్ళు, చేతులు నీ శరీరాంగాలు, కానీ నువ్వుకాదు... అయినా అవినీవే... నీబట్టల్లా,

"మరి నువ్ ఎవరు?" మరి నేను నేను ఆలోచిస్తూ ఉండిపోయాడు పార్వతీశం.

ఆయన నవ్వుతూ, "ఈ శరీరానికి పేరు ఒక గుర్తు మాత్రమే.. కేవలం ఒక సాంకేతిక అంశం. నా పేరు అనే యోచన వీడాలి... అలాగే ఈ నేను అనేదే నీ దేహం నుంచి విడివడాలి.. అదే పునరుత్థానం జీసస్ చెప్పిందీ స్వామి అరవింద చెప్పిందీ... ఇంకా జిడ్డు కృష్ణమూర్తి ప్రవచించిందీ... ఇదే...!

పార్వతీశానికి ఆయన మాటలు వింటుంటే ఏదో భ్రమలు తొలగుతున్న భావన. అయినా ఇంకా మనసు పొరల్లో మసక మసక నీడలు. యోగా క్లాసు పూర్తయ్యే సరికి ఏదో తెలీని హాయి. క్లాసు అయ్యేంత వరకూ నిశ్శబ్దంగా వున్నాడు. ఆ తర్వాత బైటకొచ్చి స్కూటర్ స్టార్ట్ చేసాడు. స్కూటర్ మీద కూర్చునే సరికి మళ్ళీ ఏవో ఆలోచనలు. కొంతదూరం వెళ్ళేసరికి ఊరేగింపు ఎదురయ్యింది. బేనర్లతో జన సమూహం ముందు గా తెల్లటి అంగీల్లో ఫాదరీలు.. ఆతర్వాత కన్యకా స్త్రీలు.

"క్రైస్తవుల పై దాడులు నశించాలి. దోషులను శిక్షించాలి" నినాదాలు మెల్లగా వినిపిస్తున్నాయి.

కాసేపు అలా బారులుగా సాగుతున్న వారి వైపు చూస్తూ స్కూటర్ ఆపేడు పార్వతీశం.

ఎవరో తెలిసిన వ్యక్తి పలకరించాడు పార్వతీశాన్ని అతన్ని గమనించకుండా తల తిప్పి ఎటో చూస్తూన్నాడు.

"సార్ పీటర్ గారూ, మీరు రండి..." ఆ వ్యక్తి గట్టిగా పిలిచాడు. అతన్ని గమనించనట్టే గబగబా స్కూటర్ ముందుకు పోనిచ్చాడు. ఆ :జన సమూహాన్ని దాటుకుంటూ.

ఆ రోడ్డు దాటిన పార్వతీశం తనుండే వీధి మొదలుకు వచ్చేసరికి ఎవరో కుర్రాడు. అప్పుడే వికసిస్తున్న యవ్వనం. నూనూగు మీసాలు. గోడ మీద ఏదో రాస్తున్నాడు. దూరం నుంచే చదివాడు. తెల్లటి గోడ మీద ఎర్రటి అక్షరాలు. "కారంచేడు, పదికికుప్పం.." ఇంతలో ఎవరో అరిచారు. అంతే ఆ కుర్రాడు రాయడం ఆపి పరిగెత్తాడు. పార్వతీశం స్కూటరుతో వేగంగా అక్కణ్ణించి కదిలాడు. కారణం ఆ కుర్రాడు తెల్సిన మనిషి.

వేగంగా ముందుకు వెళుతున్న పార్వతీశం కళ్ళల్లో ఏదో మంట... మంటల్లోంచి మరో మనిషి.. క్రీస్తు నేడు లేచెను... హల్లెలూయ... యోగా క్లాసులో గురూజీ పాఠం తనింక చనిపోలేదా? పోతే ఎలా తిరిగి లేవడం! టీవీలో సజీవదహనం చేయబడిన ఆస్ట్రేలియా మిషనరీ... అతడి కొడుకులు కాలుతున్న దృశ్యం ఎదురుగా లారీ... వేగం తగ్గలేదు. లారీ వెళ్ళిపోయింది. పార్వతీశాన్ని గుద్దుకుంటూ..

* * * * *

పైన ఫేన్ తిరుగుతోంది. కిటికీలకు తెల్లటి కర్టెన్లు. మెల్లగా కనురెప్పలు తెరిచిన పార్వతీశానికి కనిపించిన దృశ్యం అది.

'ఇదేమిటి? ఇది హాస్పిటలా?' అనుకుంటూ భారంగా లేవబోయాడు. తలకు కట్టిన బేండేజీతో తలంతా బరువుగా అనిపించింది. కుడిచేతికి తగిలిన గాయం తీవ్రత వల్ల రక్తం తోడేస్తున్నట్టుగా బాధ... కళ్ళు పూర్తిగా తెరిచే సరికి... వెలుగు తీవ్రత భరించలేని కళ్ళు మూసుకున్నాయి.

"ఏవండీ!" అనే పిలుపుతో మళ్ళీ కళ్ళు తెరిచాడు. ఎదురుగా భార్య బాగా ఏడ్చిన చిహ్నంగా ఉబ్బినట్టున్న కళ్ళు. ఆమె పక్కనే మావగారు.

"నాన్న, ఈయనకేమయిందో.. మేనమామ పోయినప్పట్నించీ అదోలా వుంటున్నారు.."

పార్వతీశం మౌనంగా వున్నాడు, ఆమె మాటలకు బదుల్వికుండా అతడి మావగారు నోరిప్పారు.

"బాబూ నీ మనసులో లేనిపోని భయాలు పెట్టుకోకు జరిగిపోయిన దాని గురించి బెంగ ఎందుకు? అందరు పోవాల్సిన వాళ్ళమే ఒకరు ముందు, ఒకరు వెనుక.. నీ భార్యా పిల్లలు పుణ్యం చేసుకున్నారు, ప్రాణాలు నిలిచాయి, లారీ ఏక్సిడెంటు అయినా..."

ఆయన మాటలు పూర్తిగా వినకుండానే సెడిటివ్‌ల ప్రభావం వలన మగతలోకి జారుకున్నాడు పార్వతీశం.

* * * * *

పది రోజుల తర్వాత పార్వతీశంకు ఒంట్లో ఓపిక వచ్చింది. మెల్లగా నడవగలుగుతున్నాడు. అయినా హాస్పిటల్‌లోనే వుండాలన్నారు.

ఒక రోజు రూము దాటి బైటకొచ్చాడు. ఒక్కసారి స్వేచ్ఛావాయువులు పీల్చుకొన్నట్టుయింది పార్వతీశానికి. బయట ప్రపంచపు హడావుడీ.. శబ్దాలు చెవున పడే సరికి ప్రాణం లేచి వచ్చినట్టయింది. అలా హాస్పిటల్ కారిడార్‌లో తిరుగుతూ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ దగ్గర ఆగిపోయాడు. ఆ గది గుమ్మం ముందు ఒక స్త్రీ తెల్సిన ముఖం. నుదుటి మీద అర్ధరూపాయంత కుంకుమ బొట్టు. ఈమె ఆచారి భార్య. తమ రీజినల్ ఆఫీసులో ఆడిట్ డిపార్ట్‌మెంటు వారం క్రితం కనిపించాడు. గుండు చేయించుకోవడంతో తను అడిగాడు, "తిరుపతికి వెళ్ళొచ్చారా?" అని "లేదండీ మా నాన్నగారు పోయారు" అన్నాడు తనకపుడు అదోలా అనిపించింది, ఎందుకు అలా అడిగానా అని..

అదంతా గుర్తొచ్చి, మరయితే ఇంత సడన్‌గా ఆయన ఐసియులోకి వచ్చే పరిస్థితి ఏమిటో?

మెల్లగా నడుచుకుంటూ ఆచారి భార్య దగ్గరకెళ్ళి ఆచారిగారికి ఏమయింది? అన్నాడు.

ఆమె కళ్ళల్లో నీరు కక్కుకుంటూ అలాగే నిలుచుంది, సమాధానం చెప్పకుండా.

ఆమె బాధగా వుందని, ఆమెను ప్రశ్నించడం ఇష్టంలేక అలాగే నించున్నాడు. ఇంతలో ఒక ముసలాయన వచ్చి ఆమెతో ఏదో మాట్లాడుతున్నాడు. నెరిసిన జుట్టు, తెల్లపంచె, తెల్లచొక్కా...! ఆయన ఆచారి మావగారు. ఒకసారి ఆచారి పరిచయం చేసాడు. ఆ విషయం గుర్తువచ్చి "నేను ఆచారిగారి బేంకే. నా పేరు పార్వతీశం..." అన్నాడు.

ఆయన తలెత్తి పార్వతీశం వంక చూసి "ఆచారిగారి తండ్రిగారిని కాశ్మీరులో చంపేసారు... నెల రోజులయింది.. ఆ రోజు నించీ తీవ్ర మానసిక సంక్షోభంలో పడ్డారు. నిన్న రాత్రి హఠాత్తుగా గుండెనొప్పి వచ్చి స్ట్రోక్ రావడంతో ఐసియులోకి చేర్చారు."

ప్రశ్నార్థకంగా చూసాడు పార్వతీశం. ఆయన వంక. తిరిగి ఆయన చెప్పడం ప్రారంభించాడు.

"కాశ్మీరులో ఆచారి తమ్ముడు పనిచేస్తున్నాడు. మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్ అతడిని చూడడానికి వెళ్ళిన ఆచారి తండ్రి, అక్కడ ఎవరో కాశ్మీర్ పండిట్ వున్నారని వారితో ఇది వరకటి స్నేహం పురస్కరించుకుని వెళ్ళేడు. అంతే... అతడితోపాటూ ఆచారి తండ్రిని కాల్చి చంపేరు తీవ్రవాదులు.."

"అయ్యో..." అనుకున్నాడు పార్వతీశం.. తన చేతుల మీదుగా తండ్రిని పైకి పంపాలనుకున్నాడు కానీ, తండ్రి చివరి చూపులూ దక్కలేదు.. శవాన్ని కాల్చే వీలు లేక పూడ్చి పెట్టారట... అదే ఆచారిని తీవ్ర అంతర్మథనానికి గురిచేసింది. అయినా

ఈ కట్టెలోని జీవుడు పంచభూతాల్లో కలిసిన తర్వాత కాలిస్తేనేం, పూడిస్తేనేం...”

ఆ మాటలు చెళ్ళున తగిలాయి పార్వతీశానికి తండ్రి గురించి అంతగా కలత చెంది ఆచారి హార్ట్ ఎటాక్ తెచ్చుకున్నాడు.. మరి తను? పార్వతీశం కళ్ళల్లో నీటి తెరలు. మౌనంగా అక్కణ్ణించి కదిలి తన రూముకు చేరుకున్నాడు. రెండు రోజుల తర్వాత పార్వతీశాన్ని అసుపత్రి నించి డిశ్చార్జి చేసారు. భార్య వచ్చింది తోడుగా. ఆటోలో బయలుదేరారు. తాము వుండే ఇల్లుకు చేర్చే రోడ్డు మొదట్లో ఏదో ఊరేగింపు.. గబగబా దిగాడు భార్య వద్దని వారిస్తున్నా వినకుండా... “నేను నడిచి వచ్చేస్తాను నువ్వెళ్ళు...” అంటూ ముందుకు కదిలాడు.

ఆ ఊరేగింపులో మనుషులు అరుస్తున్నారు. “ఆస్ట్రేలియా మిషనరీ, అతడి కొడుకుల్ని సజీవంగా చంపిన దోషుల్ని శిక్షించాలి. ఆ గుంపులో నినాదాలు.. పార్వతీశం వారితో పాటూ అరిచాడు. ఇండియా టుడే పత్రికలో ఆ మిషనరీ పిల్లల లేత ముఖాలు గుర్తొచ్చి ఏడుస్తూ అరిచాడు. కొంతదూరం నడిచి తన వీధి మలుపు తిరిగి ఇంటివైపు నడక సాగించాడు.

తన వీధి సందు చివర గోడ మీద అంతకు ముందు తను చూస్తూండగా ఎవరో రాసిన అక్షరాల వంక చూసాడు. ఆ గోడ క్రింద బొగ్గుముక్క కనిపించింది పార్వతీశానికి. తనూ రాసాడు ఆ అక్షరాల ప్రక్కనే.. “బీహార్‌లో దళితులపై మళ్ళీ మారణహోమం.. ఎన్నాళ్ళీ నరమేధం...” అలా రాస్తుండగా ఆ వీధిలో వెళుతున్న వాళ్ళంతా పార్వతీశాన్ని చూసారు! అయినా గబగబా రాసి ఇంటికి చేరుకున్నాడు.

* * * * *

పార్వతీశం ఇంకా శలవులోనే వున్నాడు. అతనిని ఆసుపత్రి నించి డిశ్చార్జి చేసారని చూడడానికి ఇంటికొచ్చే సందర్శకులు ఎక్కువయ్యారు.

ఆ రోజుసాయంత్రం మిత్రుడు లాజరస్ వచ్చాడు చూడడానికి. ఇద్దరూ మాట్లాడుతుంటే ఒకాయన లోపలికొచ్చాడు. తెల్లగా పెరిగిన గెడ్డం, భుజాల వరకూ

పెరిగిన జుట్టు... ప్రశాంతంగా వున్న ముఖం. ఆయనని కొద్ది రోజుల క్రితం యోగా కేంద్రంలో చూసాడు. ఆ రోజు ఆయన వేసిన ప్రశ్నలు... తనిచ్చిన సమాధానం... తిరిగి ఆయన ముక్తాయింపు వరసగా గుర్తుకొచ్చాయి పార్వతీశానికి. మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

"మిత్రమా.. వీరొస్తే నీ లోకంలో నీ వుండిపోయావ్.." అన్నాడు లాజరస్.

ఆ మాటలకు వెంటనే తెప్పరిల్లి... "సారీ సర్.. ఏదో ఆలోచనల్లో వుండిపోయాను..." అన్నాడు పార్వతీశం నొచ్చుకుంటూ...

ఆయన "పరవాలేదండీ..." అంటూ చెప్పడం ప్రారంభించాడు.

"కాశ్మీరులో పండితుల ఊచకోత గురించి, మీకు తెలియంది కాదు. ఎంతో మంది బలవుతున్నారు... రాష్ట్రపతికి ప్రధాన మంత్రికి ఉత్తరాలు రాస్తున్నాం. లక్షమంది చేత సంతకాలు చేయించి వారికి పంపుతాం... కాశ్మీరులో శాంతియుత సహజీవనానికి నాంది పలకడానికి మా ఈ చిన్ని ప్రయత్నం..." అన్నాడు.

పార్వతీశం ఆయన దగ్గర కాగితాలు తీసుకుని, తను సంతకంచేసి, లాజరస్‌తోనూ చేయించి తిరిగి ఆయనకు ఇచ్చేసాడు.

ఆయన థేంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు. ఆయన వెళ్ళిన కొద్దిసేపట్లో మళ్ళీ ఆలోచనల్లో మునిగిపోయాడు పార్వతీశం.

అతడి మౌనాన్ని భగ్నం చేస్తూ. "నిన్న ఆసుపత్రి నించి వస్తూ ఆ ఊరేగింపులో నినాదాలు ఇచ్చావ్ కదా!... నేను చూసాను, నీలో వచ్చిన ఈ హఠాత్ పరిణామం వెనుక రహస్యం ఏమిటి?" అన్నాడు లాజరస్.

లాజరస్ వేసిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా మళ్ళీ మౌన యోగంలోకి వెళ్ళి పోయాడు పార్వతీశం.

ఆ రోజు యోగా క్లాసులో ఇపుడు తనను కలిసిన గురూజీగారు ప్రశ్నలకు తను సమాధానం చెప్పలేకపోయాడు. కానీ ఈ రోజు చెప్పగలడా?

తనలో తాను ప్రశ్నలు వేసుకోవటం ప్రారంభించాడు.

"నీ పేరేంటి?"

"నన్ను పీటర్ అంటారు."

"నువ్ ఎక్కడుంటావ్?"

"నా దేహంలో."

"నీ దేహం ఎక్కడుంది?"

"ఈ విశాల విశ్వంలో."

"నువ్ ఎలా వుండాలనుకుంటున్నావ్?"

"విశ్వమానవుడిగా మరి నన్ను సమాజం స్వీకరించడం లేదు."

"పోనీ నువ్వే సమాజాన్ని స్వీకరించు"

ఇంతలో బైటనుచి "పీటర్‌గారూ!" అనే కేక వినిపించింది. వెంటనే నిద్ర నుంచి అప్పుడే లేచినవాడిలా వేగంగా బయటకు నడిచాడు పార్వతీశం.

– రచన మాసపత్రిక, మార్చి 2002

* * * * *